ప్రజాశక్తి

మంగళవారం 30 డిసెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

ప్రజా ఉద్యమం ద్వారా

'ఉపాధి' చట్టాన్ని కాపాడుకుందాం..

సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

8వ పేజీ

కలెక్టర్ రాజాబాబు

ఇసుక అక్రమ రవాణాపై

ఉక్కుపాదం

కలెక్టర్ రాజాబాబు ఆదేశం

5వ పేజీ

మార్కాపురం జిల్లాకు

కేబినెట్ ఆమోదం

- 'ప్రకాశం'లో ఆ రెండు నియోజకవర్గాలు విలీనం
- అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ రూపాంతరం
- రేపు గజిట్ జారీ..
- జనవరి ఒకటి నుంచి అమలులోకి..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మార్కాపురం జిల్లాకు రాష్ట్ర మంత్రి వర్గం సోమవారంనాడు ఆమోదం తెలిపింది. ముందుగా ప్రకటించినట్లుగా నాలుగు నియోజకవర్గాలతోనే మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటు కాబోతోంది. అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలిపే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదించింది. వీటితో పాటు అద్దంకి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బుధవారంనాడు గజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. కొత్త ఏడాదిలో మార్కాపురం నూతన జిల్లాలో పాలన మొదలు కానుంది. ఎప్పటి నుంచో ప్రకాశంలో కలిసేందుకు ఎదురుచూస్తోన్న అద్దంకి, కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష కూడా అదే రోజున నెరవేరనుంది. ఇక అద్దంకి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. అద్దంకి కేంద్రం భవిష్యత్‌లో పాలనా కేంద్రంగా మారబోతోంది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇక్కడ రెవెన్యూ డివిజన్ రావడంలోనూ, దర్శి నియోజకవర్గం మొత్తం ప్రకాశంలోనే ఉండేలా చూడటంలో కీలకపాత్ర పోషించారు. అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లోని మండలాలు ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంటాయి. పాత తాలూకా కేంద్రంగా అద్దంకి ఒకప్పుడు ఎంతో ప్రాధాన్యత ఉండేది. ఇప్పుడు మళ్లీ పాలనాపరంగా రెవెన్యూ డివిజన్ కావడం గమనార్హం. రెవెన్యూ, పోలీసుశాఖ పరంగా పటిష్టం కానుంది. కొన్ని శాఖలకూ డివిజన్ స్థాయి కార్యాలయాలూ ఉంటాయి. ఇక కొత్తగా మార్పులు, చేర్పులతో ఏర్పాటవుతున్న ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మొత్తం పది నియోజకవర్గాలున్నాయి. ఉమ్మడి ప్రకాశంలోని ▶ 2లో

కల నెరవేరిన వేళ..

జనవరి నుంచి 'మార్కాపురం జిల్లా'

ప్రజాశక్తి-మార్కాపురం

'మార్కాపురం జిల్లా' కల నెరవేరింది. ఎట్టకేలకు మంత్రివర్గ ఆమోదం లభించింది. 2026 జనవరిలో మార్కాపురం కేంద్రంగా జిల్లా పాలన మొదలు కానుంది. నాలుగు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న పశ్చిమ ప్రాంత ప్రజానీకం నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది.

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఇది వరకే కావాల్సి ఉంది. ఈ ప్రాంత పాలకుల మెతకవైఖరితో మార్కాపురం జిల్లాగా నోచుకోలేదనే వాదన ప్రజల్లో ఉంది. వైసిపి ప్రభుత్వంలో జరిగిన జిల్లాల పునర్విభజనలో అవుతుందనుకున్నారు. ఆశలపై అప్పటి ప్రభుత్వం నీళ్ల చల్లింది. నల్లమల అటవీ ప్రాంతం నుంచి సముద్ర తీరాన గల ఒంగోలులోని జిల్లా కేంద్రంతో పశ్చిమ ప్రకాశం ప్రజలు పరిపాలనా సౌలభ్యానికి నోచుకోలేదు. ఇక్కడి ప్రజలు సుదూరంలోని ఒంగోలుకు రాకపోకలు సాగించాలన్నా కష్ట నష్టాలకు లోనయ్యారు. రెవెన్యూ సమస్యలు స్థానికంగా పరిష్కారాని నోచుకోక ఇబ్బందులు పడ్డారు. ఇక్కడి ప్రజలు కోరుకుంటున్న పరిపాలనా సౌలభ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మార్కాపురం జిల్లాగా ఆమోదం లభించింది. పాలన కూడా 2026 జనవరి 1వ తేదీ నుంచి జిల్లా పాలన సాగించాలని అధికారులకు సంకేతాలు అందాయి. ఈ మేరకు నోటిఫికేషన్ వెంటనే జారీ కానుంది.

మార్కాపురం పట్టణం విహంగ వీక్షణం

భవనాల కోసం అన్వేషణ

మార్కాపురం కేంద్రంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎస్‌పి కార్యాలయం ఏర్పాటు కోసం కసరత్తు ప్రారంభమైంది. కీలకమైన కార్యాలయాల కోసం అవసరమైన భవనాల అన్వేషణలో అధికారులు నిమగ్నమయ్యారు. పలు విభాగాలకు చెందిన ప్రభుత్వ భవనాల పరిశీలన జరిగింది. తక్షణ అవసరంగా అందుబాటులో ఉన్న కాలేజీ రోడ్డులోని ఎస్‌వికెపి కళాశాల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంగా ఎంపికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ పాటికే ఎస్‌వికెపి కళాశాల భవనాల యొక్క కొలతలను సర్వేయర్లు తీసుకోవడం జరిగింది.

జిల్లా సాధనలో 'కందుల' పాత్ర కీలకం

మార్కాపురం జిల్లా సాధనలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాత్ర కీలకమనే చెప్పాలి. గత వైసిపి ప్రభుత్వంలోనూ జిల్లా కోసం చేసిన పోరాటం ఆమరణ నిరాహారదీక్ష వరకు చేరింది. ఎమ్మెల్యే కందుల చేపట్టిన జిల్లా ఉద్యమానికి అప్పటి ప్రతిపక్ష పార్టీలన్నీ సహకరించాయి. వామపక్ష పార్టీలతో సహా మద్దతు పలికాయి. ఉద్యమంలో పాల్గొన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినా జిల్లా ప్రకటించకపోవడంపై ఈ ప్రాంత ప్రజల్లో అపనమ్మకం ఏర్పడింది. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా జిల్లా ప్రకటనలో జాప్యం జరుగుతుండటంపై ఒకింత ఆందోళన చెందినట్లు తెలిసింది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కూటమి ప్రజా ప్రతినిధులతో సిఎం చంద్రబాబుకు పలుమార్లు మార్కాపురం జిల్లా అంశంపై మాట్లాడి ఒప్పించిన నేపథ్యంలో 'మార్కాపురం జిల్లా'గా ఆవిర్భవించిందని చెప్పవచ్చు.

మార్కాపురం జిల్లాకు కేబినెట్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

మరో రెండు నియోజకవర్గాలు చీరాల, పర్చూరు పక్కనున్న బాపట్ల జిల్లాలోకి వెళ్లాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నర తర్వాత మార్కాపురం జిల్లా కల సాకారమైంది. పశ్చిమప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాలకు పాలనావ్యవస్థ అందుబాటులోకి రానుంది. కలెక్టర్, ఎస్పీలతో పాటు అన్ని శాఖల జిల్లా కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే వీటి ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చారు. కార్యాలయాల అన్వేషణలో ఉన్నారు. రెవెన్యూ డివిజన్‌గా ఉన్న మార్కాపురం ఇక నుంచి జిల్లా కేంద్రంగా మారనుంది. పాలనావ్యవస్థ మెరుగుపడనుంది. ఒంగోలు ఇచ్చి అర్జీ ఇచ్చే పరిస్థితి నుంచీ పశ్చిమ ప్రాంతవాసులకు తప్పిది. ఇక నుంచి మార్కాపురం వెళితే.. కలెక్టర్, ఎస్పీ అందుబాటులో ఉంటారు. పశ్చిమప్రాంతంలో మార్కాపురం జిల్లా ఏర్పాటుపై సంబరాలు జరుపుకుంటున్నారు. రాజకీయంగా దీన్నుంచి కూటమి పార్టీలు లబ్ధి పొందేందుకు ప్రయత్నాల్లో ఉన్నాయి. వాస్తవానికి అన్ని రాజకీయపార్టీలు మార్కాపురం జిల్లా కోసం ఆనాడు పోరాడాయి. గత ప్రభుత్వ హయాంలో మార్కాపురం జిల్లా ఏర్పాటును మరిచారు. పార్లమెంటుస్థానాల వారీగా జిల్లాలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు, పార్టీల అభిప్రాయాలు బుట్టదాఖలయ్యాయి. ఆనాటి నుంచి ఉద్యమం నడిచింది. కూటమి పార్టీలు ఎన్నికల్లో హామీలు ఇచ్చాయి. ఇప్పుడు దాన్ని నెరవేర్చారు. ఎట్టకేలకు మార్కాపురం జిల్లా ఏర్పాటయింది.

చలికోట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు చలికోట్లు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణానికి చెందిన ఓ సాధారణ బైక్ మెకానిక్ వడ్లమూడి నాగలింగాచారి మానవతా దృక్పథానికి నిదర్శనంగా నిలిచారు. యర్రగొండపాలెం సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు చలికాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్వయంగా గమనించిన ఆయన మనసు చలించింది. విద్యార్థులకు ఏదైనా సహాయం చేయాలన్న సదుద్దేశంతో సోమవారం ఆయన 200 చలికోట్లు కొనుగోలు చేసి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు, విద్యార్థుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. ఆయన సేవా నిరతి పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సిఎల్ఆర్ కాలేజీ వద్ద బస్సులు ఆపాలి

ప్రజాశక్తి-కంభం

కంభం మార్కాపురం రహదారిలోని సిఎల్ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల వద్ద ఆర్టీసీ బస్సులను ఆపకపోవడంతో గంటల తరబడి వేచిఉండి, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. మార్కాపురం, గిద్దలూరు డిపో ఆర్డినరీ బస్సులు నిత్యం ఆ రహదారిలో వెళ్తుంటాయి. కానీ సిఎల్ఆర్ కళాశాల వద్ద బస్సులు ఆపడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సిఎల్ఆర్ కళాశాల వద్ద బస్టాప్ ఏర్పాటు చేసి, ఆర్టీసీ బస్సులలో విద్యార్థులను ఎక్కించుకునేలా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

రేపు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-రాచర్ల: జనవరి 1వ తేదీన అందజేయాల్సిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఈ నెల 31వ తేదీనే అందిస్తున్నట్లు రాచర్ల ఎంపీడీవో సూర వెంకట రామిరెడ్డి తెలిపారు. సిబ్బంది ఈ నెల 30వ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల అమౌంట్ బ్యాంకు నుంచి డ్రా చేస్తారన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల జోనల్ లెవెల్ స్క్రీనింగ్‌లో 9 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రత్యేక అవసరాల పిల్లల క్రీడల్లో జోనల్ లెవెల్ స్క్రీనింగ్‌లో 9 మంది ఎంపికయ్యారు. సోమవారం సమగ్ర శిక్ష నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాపట్ల, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 100, 400, 800 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా, ప్రతిభ ఆధారంగా 9 మంది విద్యార్థులను తదుపరి దశకు ఎంపిక చేసి కేంద్ర కార్యాలయానికి పంపించారు. కార్యక్రమాన్ని 100 మీటర్ల పరుగు పందెంతో ప్రారంభించగా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి జెండా ఊపి పోటీలకు శ్రీకారం చుట్టారు. తదనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు యోధుడితో సమానమని ప్రశంసించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు క్రీడల్లోనూ అద్భుత ప్రతిభ కనబరచగలరనడానికి ఈ పోటీలు దోహదపడతాయని అన్నారు. వారి విజయానికి సమగ్ర శిక్ష పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల సహిత విద్య సమన్వయకర్తలు నాగేంద్ర నాయక్, ప్రసాదరావు, జ్యోత్స్న పాల్గొన్నారు. స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్), ఐఆర్పీలు హాజరయ్యారు. కార్యక్రమం మొత్తాన్ని సమగ్ర శిక్ష స్పోర్ట్స్ కన్సల్టెంట్ కే శంకర్ పర్యవేక్షించారు.

ఎండ్లూరులో రీ సర్వేపై ర్యాలీ

రీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎండ్లూరు గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రీ సర్వేపై గ్రామసభ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతులు తమకు చెందిన భూములకు సంబంధించి పూర్తి హక్కు పత్రాలతో రీ సర్వే బృందానికి సహకరించాలని డిప్యూటీ తహశీల్దార్ ఎన్ మాబు సుభాని గ్రామ సభలో కోరారు. జనవరి రెండో తేదీ నుంచి ఎండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తమకు సంబంధించి భూముల సర్వే నెంబర్లు, విస్తీర్ణములు, రెవెన్యూ రికార్డుల్లో వీటి ద్వారా పక్కాగా నమోదు కానున్నట్లు ఆయన వెల్లడించారు. రీ సర్వేపై రైతులు, గ్రామస్తులకు మండల సర్వేయర్ ఎం రాజేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కరిచేటి సురేష్, దాసరి వెంకట్రావు, గుర్రం కృష్ణ, నల్లూరి శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఎం రాజేష్, వీఆర్వో ఏసీ ఆదిరెడ్డి, గ్రామ సర్వేయర్ సుభాషిణి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యుత్ సంస్థలో దశాబ్దాలుగా పనిచేస్తున్న మీటర్ రీడర్ల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం ఒంగోలులో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మల్లయ్య లింగం భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా మీటర్ రీడర్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న స్మార్ట్ మీటర్లు, సోలార్ విధానాల వల్ల 20 ఏళ్లుగా పనిచేస్తున్న మీటర్ రీడర్ల ఉపాధి తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోకుండా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వారి విద్యార్హతల ప్రకారం నియమించాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి ట్రెజరీ, బ్యాంకుల ద్వారా వేతనాలు చెల్లించాలని, ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలపై భారాలు మోపే సిమ్‌కార్డు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రతతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం స్వీకరించిన జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కుంచాల సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ హుస్సేన్, నాగార్జున తదితర నాయకులు, మీటర్ రీడర్లు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-పొదిలి

గాయపడిన సాల్మన్‌రాజు

మండలంలోని అముదాల పల్లి గ్రామానికి చెందిన యువకుడు కొమ్ముల సాల్మన్ రాజు సాయంత్రం ఏడున్నర గంటల సమయంలో చిన్నారికట్ల జంక్షన్ వద్దకు వెళుతూ ఉండగా పొదిలి పట్టణంలోని విశ్వనాథ పురం మెయిన్ రోడ్‌లో హైదరాబాద్ లాడ్జ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పిం చుకునే క్రమంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టి పడిపోయాడు. ఈ సంఘటనలో ముందుకు పడ్డ సాల్మన్‌రాజు తలకు, ఛాతీకి బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోనికి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే ప్రత్యేక అంబులెన్స్ వాహనంలో ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు. పొదిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No : 268/2025

I. A. No:682/2013

O.S. No: 48/1999

Between :

తూమాటి దిబ్బమ్మ వగైరా.... పిటీషనర్స్/ వాదులు

Vs

తూమాటి పిచ్చయ్య (Died) వగైరాలు

....రెస్పాండెంట్స్ /ప్రతివాదులు

To

R8) కాకాని సుబ్బమ్మ, W/o సుదర్శన్

R/o రావినూతలగ్రామం, కోరిశపాడు మండలం,

బాపట్ల జిల్లా

పై తెలిపిన దావా పిటీషనులో వారసులుగా 8వ రెస్పాండెంట్ అయియున్నారు. కోర్టు వారు పలు పర్యాయములుమీకు నోటీసు ద్వారా తెలియ జేసియున్నారు. మీరు రానందున పత్రికా ప్రకటన ద్వారా మీరు 31-12-2025వ తేది ఉదయం 10.30 ని.లకు పై తెలిపిన కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షముగా కోర్టు వారు తీర్పు చెప్పేదరు. ఇందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 31-12-2025

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

అద్దంకి ఇట్లు

తేది : **28-12-2025** **గూడాల అంజిరెడ్డి**

పిటీషనరు తరపు న్యాయవాది

అద్దంకి

హామీలు నిలబెట్టుకుంటూ..

ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి

ప్రజాశక్తి -పామూరు

గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం తన లక్ష్యమని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి తెలిపారు. స్థానిక నెల్లూరు రోడ్‌లో ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా కాకుండా సేవకుడిగా పని చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆదర్శంగా తీసుకొని నియోజవర్గ అభివద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రైల్వే, బయో గ్యాస్, నింజు త్వరలో సాధించుకుంటామని తెలిపారు. ప్రతి ఇంటికి కొళాయి అందించడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా 24 కుంటుబాలు టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఉగ్ర కండువాడు కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, మాజీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎఎంసి చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, మోపాడు ఆయకట్టు కమిటీ చైర్మన్ చుంచు కొండయ్య, సాంబయ్య, రమణయ్య, రహీముల్లా, ప్రసాద్ రెడ్డి, కోటిరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

విరాళాలు సేకరిస్తున్న నాయకులు

విరాళాల సేకరణ

ప్రజాశక్తి సిఎస్‌రం రూరల్

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి 2026 జనవరి 4 వరూ నిర్వహిస్తున్న సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు ఎం.రత్నారెడ్డి కోరారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, రెడ్డిగారి పల్లి గ్రామంలో సంఘీభావ నిధిని సేకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిసిపల్లిలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

పిసిపల్లిలో...

పిసిపల్లి : విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వరకూ నిర్వహిస్తున్న సిఐటియు జాతీయ 18వ మహాసభలను జయ ప్రదానికి సహకరించాలని కోరుతూ సిఐటియు కార్యకర్తలు సోమవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాసభల్లో కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు జనార్ధన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుగా శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి -కురిచేడు

కురిచేడు ఇన్‌ఛార్జి తహశీల్దారు దర్శి తహశీల్దారు శ్రావణ్ కుమార్‌కు ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది. కురిచేడు తహశీల్దారుగా పనిచేస్తున్న బి.రజినీకుమారి అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో దర్శి తహశీల్దారు శ్రావణ్ కుమార్‌ను ఇన్‌ఛార్జి తహశీల్దారుగా నియమించారు.

శ్రావణ్ కుమార్

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా పనిచేస్తుందని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోగులదిన్నె గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెంథా తుఫాను సందర్భంగా భారీ నష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నివేశ స్థలాలు, కాలనీలు కావాలని, ఎన్ఎపి నీరు సక్రమంగా సరఫరాకాక ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మూరబోయిన బాబూరావు, పొదిలి, మార్కాపురం ఎఎంసి చైర్మన్లు సయ్యద్ ఇమాంస, మాలపాటి వెంకటరెడ్డి, వెలుగొండ ఆలయ చైర్మన్ కుందురు కాశిరెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జవ్వాజి భాషాపతినాయుడు, చిన్నారికట్ల సింగిల్ విండో అధ్యక్షుడు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-దర్శి

దర్శి పట్టణంలోని హ్యాపీ హోమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోమవారం ప్రారంభించారు. తొలుత నాలుగో వార్డులో రూ. 43 లక్షల రూపాయలతోసైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 19వ వార్డులో రూ. 30 లక్షలతో సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, పిఎసిఎస్ చైర్పర్సన్ కలవకొలను శేఖర్ పంతులు, స్థానిక నాయకులు షేక్.సుభాని, సింగయ్య నారాయణరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ లైట్లను ప్రారంభిస్తున్నగొట్టిపాటి లక్ష్మి

కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి-దర్శి

పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన కార్యకర్తలకు టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ ప్రశంసా పత్రాలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనని, ప్రతి కార్యకర్త సైనికుని వలె పనిచేసి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎఎంసి చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దొనకొండ, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల టిడిపి అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేస్తున్న గొట్టిపాటి లక్ష్మీ

మాట్లాడుతున్న దాత మధువని

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని గుంటుపల్లి జడ్‌పి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వవిద్యార్థిని మహంకాళి మధువని యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన స్టడీ మెటీరియల్, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా దాత మధువని మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోతులూరయ్య, ఉపాధ్యాయులు జి. నరసింహారెడ్డి, కె.సత్యనారాయణ, పివి.రమణయ్య పాల్గొన్నారు.

మోడెం బహూకరణ

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్

సిఎస్‌పురం మండలం కోవిలంపాడు సచివాలయంలో నెట్‌వర్క్ పనిచేడం లేదు. దీంతో సచివాలయం సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేంది. ఈ సమస్యను గుర్తించిన గ్రామస్తుడు ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి మరియు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ రజబ్ బాషా ఎయిర్టెల్ వైఫై కనెక్షన్ మోడెంను సచివాలయ సిబ్బందికి అందజేసి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ రుసుం ఖాజావలి, షేక్ హజరత్, షేక్ ఖలీల్, షేక్ చిన్న ఖాజావలి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-దర్శి

మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఎల్ఐసి కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకూ సైడ్ కాలువలు నిర్మించాలని కోరారు. మేజర్ కాలువల్లో పుడికితిత పనులు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం బహూకరణ

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మండల పరిధిలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి ముదిరెడ్డి భాస్కర్, ఆయన గురువు పువ్వాడి కృష్ణమూర్తి రూ. 40 వేల విలువైన సౌండ్ సిస్టంను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల ప్రధానో పాధ్యాయుడు షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

డీజీ పేటను మండల కేంద్రం చేయాలి

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్

డిజిపేట గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు డీజీపేట గ్రామానికి చెందిన మేదరపల్లి కిరణ్, ఊటుకూరి రాజేష్ సోమవారం ఒంగోలులో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 23 పంచాయతీలు ఉన్నట్లు తెలిపారు. అటవీ ప్రాంత గ్రామాలల్లోని పంచాయతీల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.డీజీపేటను మండల కేంద్రంగా ఏర్పాటు చేసి పరిసర ప్రాంతంలోని తొమ్మిది పంచాయల పరిధిలోని ప్రజల ఇబ్బందులు తీర్చాలని ఆర్జీలో పేర్కొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శివప్రసాద్

'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నిజాంపట్నం

జడ్పిటిసి నర్రా సుబ్బయ్య నివాసం వద్ద 'ప్రజాశక్తి' నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ 'ప్రజాశక్తి' ప్రతిక్షణం కార్మికులు, పేద ప్రజల కోసం పనిచేస్తుందని అన్నారు. అందుచేత ప్రజాశక్తి పేపర్‌ను ప్రతి ఒక్కరు ఆదరిస్తున్నారని అన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణలో జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భైరవకొనలో ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

సిఎస్ పురం : 'ప్రజాశక్తి' 2026 నూతన క్యాలెండర్‌ను భైరవకోన ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు సోమవారం ఆవిష్కరించారు భైరవకోనలో చైర్మన్ ప్రమాణ స్వీకార అనంతరం స్థానిక టిడిపి నాయకులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రజాశక్తి దినపత్రిక' ప్రజల్లో మంచి గుర్తింపుతో పాటు ఆదరణ లభించిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షులు తోడేటి గోపి, మాజీ ఎంపీపీ టీ పెద అల్లూరయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి, ఐఓసీ పెట్రోల్ బంక్ అధినేత పోకల మాలకొండయ్య, టిడిపి నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, జి వెంకట రామరాజు, దొర తిరుపతయ్య, సారే వెంకటసుబ్బయ్య, చావా సుబ్బయ్య, కె వెంకట కొండయ్య, ఎ రామకృష్ణంరాజు, ఎ కొత్తపల్లి, అంబవరం సర్పంచులు ముప్పాళ్ళ శ్యామలమ్మ, కొండూరు కొండయ్య, ముప్పాళ్ళ నరసింహారాజు, రేనాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న భట్టిప్రోలు ఎంపీపీ, ఎంపిడిఒ

భట్టిప్రోలు : 'ప్రజాశక్తి' 2026 క్యాలెండర్‌ను ఎంపిపి డివి లలిత కుమారి, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 'ప్రజాశక్తి దినపత్రిక' నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతుందని అన్నారు. ప్రజాశక్తి దినపత్రికకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. నిజాలు నిగ్గు తేల్చడంలో ప్రజాశక్తి ముందుంటుందని అన్నారు. ప్రజా సమస్యలతో పాటు ఆయా రంగాల్లో జరిగే లోటుపాట్లను వెలికితీయటంలో 'ప్రజాశక్తి' స్థానం ప్రధానమైనదని అభినందించారు. ప్రతిరోజు ఉదయాన్నే ముందుగా ప్రజాశక్తి దినపత్రికలో ఎలాంటి కథనాలు వచ్చాయో, ఎలాంటి అత్యవసర సమాచారం ఉందో చూడాలనే దృక్పథంతో ప్రజానీకం దినపత్రిక కోసం ఎదురుచూస్తూ ఉంటారని పేర్కొన్నారు. ఎంపిడిఒ వెంకటరమణ మాట్లాడుతూ అధికారులు ఎక్కడికక్కడ జరిపించే కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయడంలో 'ప్రజాశక్తి' ప్రజల పక్షంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ జలజ, డిప్యూటీ ఎంపిడిఒ మల్లికార్జునరావు, నాయకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - అద్దంకి

ఈనెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం మోటార్ సైకిల్, ఆటో ర్యాలీ నిర్వహించారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ కావూరి రఘుచంద్ జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కార్మిక హక్కులు కాలరాసే విధంగా అవలంబిస్తుందని అన్నారు. కార్మిక చట్టాలు రద్దుచేసి లేబర్ కోడు బిల్లు తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. మున్సిపల్ స్కీం వర్కర్లు అనేక రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం పోరాడుతుందని అన్నారు. సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. జనవరి 4న విశాఖపట్టణంలో జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభలో కార్మిక కవర్గం పాల్గొనాలని అన్నారు. కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తూ ఐక్య పోరాటాన్ని రూపొందించుకునే జరుగుతున్న మహాసభల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని అన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం బైక్ ర్యాలీ బంగ్లా రోడ్డు, అంబేద్కర్ విగ్రహం నుండి ఆర్టీసీ బస్టాండ్, భవాని సెంటర్, ప్రభుత్వ ఆస్పటల్, గాంధీ సెంటర్ నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు నిర్వహించారు. ర్యాలీలో సిఐటియు కన్వీనర్ తంగిరాల వెంకటేశ్వర్లు, రావులపల్లి కోటేశ్వరరావు, పెనుబాక ఆదాం, ఉసురుపాటి శామ్యూల్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు డివివి సుబ్బారావు, జాన్, సుబ్బారావు, ఎస్‌కె భాష, గణేష్, శిరోమణి పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

లంక భూములను సమగ్రంగా సర్వే చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సాగుదారులుగా ఉన్న వారసులకు పట్టా, పట్టాదార్ పాస్ పుస్తకం మంజూరు చేయాలని, లంక సొసైటీ భూములను సమగ్రంగా రీ సర్వే చేపట్టాలని కోరుతూ తహశీల్దారు మేక శ్రీనివాసరావుకు సిపిఎం నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో లంక సొసైటీ భూముల సమగ్ర సర్వే చేసి ప్రస్తుతం సాగదారులుగా ఉన్న వారసులకు పట్టా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి పి మనోజ్ కుమార్ మాట్లాడుతూ 1981లో మండలంలోని ఎస్సీ, ఎస్టీలు సాగు చేసేందుకు వెల్లటూరు, పెద్దపులివర్రు, పెదలంక, ఓలేరు సొసైటీలను ఏర్పాటు చేసి లంక భూములకు సాగు పట్టాలు ఇచ్చారని అన్నారు. ఇప్పుడు ఆ భూములను వారసులు సాగు చేసుకుంటున్నారఇన అన్నారు. పట్టాదారులుగా ఉన్న వారిలో ఎక్కువమంది చనిపోవడంతో ప్రస్తుతం సాగు చేసుకుంటున్న వారసులకు పట్టాలు లేకపోవడం వలన పంట రుణాలు, వరదల సమయంలో ప్రభుత్వ అందించే నష్టపరిహారం పొందడానికి ప్రభుత్వం దయ దక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న రీ సర్వేలో సమగ్రంగా సర్వే చేసి ప్రస్తుతం సాగు చేసుకుంటున్న వారసులకు అధికారులు పట్టా, పట్టాదార్ పాస్ పుస్తకం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

చేనేత వస్త్రాలకు రిబేటు చెల్లించాలి

ప్రజాశక్తి - చీరాల

చేనేత సహకార సంఘాల్లోని చేనేత వస్త్రాల అమ్మకాలకు రాష్ట్ర ప్రభుత్వం రిబేటు సౌకర్యం కల్పించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఈపూరుపాలెంలో వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ పి కొండయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సంక్రాంతి సీజన్‌కు చేనేత వస్త్రాలపై రిబేట్ సౌకర్యం కల్పించాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో నుంచి రూ.1.50లక్షలు రావాల్సి ఉండగా కేవలం 30 శాతం మాత్రమే విడుదల చేశారని అన్నారు. ఈ డబ్బులు సంగాల క్యాష్ క్రెడిట్ వడ్డీకే సరిపోయిందని అన్నారు. కావున ఆప్కో నుంచి సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సిఎం చంద్రబాబు చేనేత కార్మికులకు ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీ, ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సహాయం, సహకార సంఘాలకు రావాల్సిన రాయితీ బకాయిలు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గద్దె హేమ సుందరరావు, ప్రాంతీయ నాయకులు యర్రం రాధాకృష్ణ, ఐవి ప్రసాద్ పాల్గొన్నారు

మాట్లాడుతున్న చేనేత నాయకులు సత్యనారాయణ

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని బుర్లవారిపాలెంలో అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ ఎంఎం కొండయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో పంచాయతీ భవనం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు రూ.55 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.35 లక్షలతో నూతన పంచాయతీ భవనం, రూ.33 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.1.23 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తాయని అన్నారు. గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, బుర్రవారిపాలెం గ్రామ అధ్యక్షులు బుర్ల రాంబాబు, ఎంపిడిఒ విజయశ్రీ, జెఇ రామచంద్రుడు, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, మాజీ ఎంపిటిసి సిద్ధి బుచ్చేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్, బుర్ల వెంకటరావు, బొంత గొర్లరాధ, కొమ్మనబోయిన రజిని, భాను పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ కొండయ్య

సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న శరత్

యానాదులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక సముద్ర తీర ప్రాంతంలో గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న 20 కుటుంబాల యానాదులను అభివృద్ధి పేరుతో తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు నివేశన స్థలాలు ఇచ్చి నివాస గృహాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శరత్ మాట్లాడుతూ సూర్యలంకలో నివాసం ఉంటున్న యానాదులకు ఎక్కడ నివాస స్థలాలు లేవన్నారు. సూర్యలంక పర్యాటక ప్రాంత అభివృద్ధి పేరుతో ఇప్పటికి పలుమార్లు యానాదులు నివాసాలు ఉంటున్న చోట నుండి వేరే చోటకి తరలించారని తెలిపారు. ఈ విధంగా ప్రతిసారి ఆర్థికంగా నష్టపోతునే ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పక్కా నివాస స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని అన్నారు. గత మూడు రోజుల నుండి నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారని అన్నారు. వృద్ధులు, పసిపిల్లలు నివసిస్తున్న గృహాలకు తాత్కాలి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

యుటిఎఫ్ ప్రకాశం జిల్లా కార్యదర్శిగా దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - పంగులూరు

దుర్గాప్రసాద్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ప్రకాశం జిల్లా కార్యదర్శిగా మండలంలోని బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు స్వర్ణ వెంకట దుర్గా వరప్రసాద్ ఎన్నికయ్యారు. ఒంగోలులో యుటిఎఫ్ ప్రకాశం జిల్లా సర్వ సభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అద్దంకి, కొరిసపాడు, జె పంగులూరు మండలాల ప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఆయన 1995లో ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరినప్పటి నుండి యుటిఎఫ్‌లో వివిధ హోదాల్లో అంకిత భావంతో పని చేశారు. ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల యుటిఎఫ్ ప్రతినిధులు ఉప్పల చెంచయ్య, రావి శ్రీనివాసరావు, వేల్పుల ఏడుకొండలు, బత్తుల సుబ్బారావు, పంగులూరు మండల నాయకులు రవిచంద్ర, బివి రత్నం, రామాంజనేయులు, శ్రీగిరి శ్రీనివాసరావు, బూదవాడ పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణానికి చెందిన చుండూరి సూర్య నారాయణ (70) మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యుల ఆమోదంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి అస్పత్రి డాక్టర్ శృతిక బృందం మృతుని కార్నియాలు సేకరించారు. రోటరీ డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావు, హరిబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న భైరవకోన ట్రస్టు బోర్డు నూతన కమిటీ

భైరవకోన చైర్మన్‌గా శ్యాంసుందర్ రాజు

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రం భైరవకోన ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా అంబవరం గ్రామానికి చెందిన ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు బాధ్యత చేపట్టారు. భైరవకోన ట్రస్ట్ బోర్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం భైరవకోనలో నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు, సభ్యులుగా ముద్దులూరి శ్రీనివాసరాజు, ముద్దులూరి వెంకట్రాజు, సారె వెంకట సుబ్బయ్య, జక్క లక్ష్మీనరసయ్య, పారా శివ, పంచాగ్నుల సరళ, గుమ్మాజి ఆదిలక్ష్మమ్మ, కోనంకి నాగమ్మ, దర్శికుంట్ల ధనమ్మ, జయంపు అంజమ్మతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రావు, ఆలయ ఈవో వంశీకృష్ణారెడ్డి ప్రమాణం చేయించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బొబ్బూరి రమేష్, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ అధ్యక్షుడు బోయల నారాయణరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మాజి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వెంకటరామరాజు పాల్గొన్నారు.



చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

చైర్మన్‌కు ఎమ్మెల్యే సన్మానం

సిఎస్‌పురం: భైరవకోన ట్రస్ట్ బోర్డు నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ముప్పాళ్ళ శ్యాంసుందర్‌రాజును కనిగిరి శాసనసభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సన్మానించారు. ప్రమాణ స్వీకార అనంతరం భైరవకోనలో దుర్గాదేవి సన్నిధిలో ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఉత్తమ సేవలు అందించండి

కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలుకలెక్టరేట్

ప్రభుత్వ సర్వీసులో ఉన్నవారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచిం చారు. కారుణ్య నియామకం కోటాలో ఉద్యోగాలు పొందిన 8 మందికి, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం పరిహారంలో భాగంగా ఉద్యోగాలు పొందిన ఇద్దరికి సోమవారం గ్రీవెన్స్ హాలులో ఆయన నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సత్యనారాయణపురం, దిబ్బలరోడ్డు, యాదవులబజార్, కరవది బజార్, చక్కనయ్య బజార్, వెంకటేశ్వర నగర్, సాయిసరోజ్ మయూరీ థియేటర్, టిడిపి ఆఫీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి.పి. రంగారావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే 'రెవెన్యూ క్లినిక్'

- ఐదు కౌంటర్లు ఏర్పాట్లు - ప్రారంభించిన కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ రెవెన్యూ క్లినిక్ లో ప్రత్యేకంగా ఐదు కౌంటర్లు ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'మీకోసం'లో ఎక్కువ ఫిర్యాదులు రెవెన్యూ సమస్యలపై వస్తున్నాయని, అందువల్ల వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా ఈ రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ సమస్య మూలం కనుగొనడంతో పాటు ఇందుకు వెంటనే పరిష్కారం చూపుతామన్నారు. ముందుగా జిల్లా స్థాయిలో ఒక నెలరోజులపాటు నిర్వహించిన అనంతరం డివిజన్ స్థాయిలో ఈ క్లినిక్‌లను నిర్వహిస్తామని తెలిపారు. చివరిగా మండల స్థాయిలో నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను రెవెన్యూ క్లినిక్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు.

రెవెన్యూ క్లినిక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

బాపట్లలో బైక్ ర్యాలీ

సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విశాఖపట్నంలో ఈ నెల 31 నుండి జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లాలోని బాపట్ల, అద్దంకితో పాటు పలు మండల కేంద్రాల్లో మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. పలు సంఘాల కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- టంగుటూరు

ప్రజాశక్తి-2026 క్యాలెండర్‌ను రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మక్కెన వెంకటరావు, మాధవరావు, మాబు, తిరుపతి స్వామి పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్య

దర్శి: ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత సాగర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎఎంసి చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్న, ఎన్‌ఎస్‌పి డిస్ట్రిబ్యూట్ కమిటీ -2 చైర్మన్ వెలుగొండరెడ్డి, నాయకులు పిచ్చయ్య, మహానంది, రామాంజనేయులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా ఒక్క ఇసుక రేణువు తరలినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలేరు వాగు నుంచి జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి సంబంధిత అధికారులతో సోమవారం ప్రకాశం భవనంలో ఆయన సమీక్షించారు. అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలను సీజ్ చేయాలని చెప్పారు. ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేసి, ఇసుక అవసరం ఉన్నట్లుగా పంచాయతీ కార్యదర్శి ద్వారా రసీదు తెచ్చుకున్న వారికే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో గనుల శాఖ డీడీ రాజశేఖర్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డిటిసి సుశీల, డిఎస్‌పి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే విజయాలు

మున్సిపల్ కార్మికుల ఉద్యమం..సమస్యల పరిష్కారానికి మార్గం..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, సంక్షేమ హక్కులు.. ఇవన్నీ మున్సిపల్ కార్మికులకు కొత్త డిమాండ్లు కాదు. దశాబ్దాలుగా వాయిదా పడుతున్న న్యాయమైన హక్కులే. అయితే ఆ హక్కుల కోసం ప్రకాశం జిల్లాలోని మున్సిపల్ కార్మికులు గత మూడు సంవత్సరాలుగా సాగించిన పోరాటం మాత్రం చరిత్రాత్మకం. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, అధికారుల బెదిరింపులను లెక్కచేయకుండా, ఐక్య పోరాటంతో ముందుకు సాగిన ఈ ఉద్యమం కార్మిక వర్గానికి దిశానిర్దేశకంగా నిలిచింది. ఈ పోరాటాలకు సిఐటియు ఆధ్వర్యంలోని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకత్వం వహించడమే కాదు.. ప్రతి దశలో కార్మికులకు అండగా నిలిచింది.



అక్రమ తొలగింపును నిరసిస్తూ మున్సిపల్ కార్మికుల ఆందోళన (ఫైల్)

2023 డిసెంబర్ సమ్మె-కార్మిక ఐక్యతకు ప్రతీక..

2023 డిసెంబర్ 26 నుంచి 2024 జనవరి 10 వరకు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె ఉద్యమానికి కీలక మలుపు. దర్శి మున్సిపాలిటీ తప్ప మిగిలిన ఆరు మున్సిపాలిటీల్లో సమ్మె శిబిరాలు ఏర్పాటు చేసి కార్మికులు పోరాటానికి దిగారు. సమాన పనికి సమాన వేతనం, కార్మికుల రెగ్యులరైజేషన్, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. సమ్మెను నీరుగార్చేందుకు పోటీ కార్మికులను తెచ్చే ప్రయత్నాలు జరిగాయి. పోలీసు యంత్రాంగం, అధికారులు ఒత్తిళ్లు పెంచారు. అయినా కార్మికులు వెనక్కి తగ్గలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఒంగోలులో 50 దళాలు, జిల్లా వ్యాప్తంగా 1150 మంది కార్మికుల పాల్గొనడం ఉద్యమ బలాన్ని చాటింది. ముందస్తు నోటీసులు, ధర్నాలు, జనరల్ బాడీలు, కలెక్టరేట్ వద్ద వంటావార్పు వంటి కార్యక్రమాలు సమ్మె విజయానికి బలమయ్యాయి.

ఉధృత పోరాటం..

2025లో ఉద్యమం మరింత పదునెక్కింది. జులై 12 నుంచి ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై, జులై 16 నుంచి 22 వరకు పారిశుధ్య కార్మికుల సమస్యలపై సమ్మె నిర్వహిం చారు. ఒంగోలులో 100 మం ది, మార్కాపురంలో 70, గిద్ద లూరులో 40 మంది ఇంజ నీరింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పొదిలి, చీమకుర్తి, కనిగిరిలో నిరసనలు చేపట్టారు.

పారిశుధ్య కార్మికులు మొత్తం 1460 మంది సమ్మెలో పాల్గొని ఉద్యమాన్ని ఉధృతం చేశారు. మానవహారాలు, వంటావార్పులు, మోకాళ్లపై కూర్చుని నిరసనలు, అర్ధనగ్న నిరసనలు వంటి ఘర్షణాత్మక పోరాట రూపాలు ప్రభుత్వాన్ని కదిలించాయి. ఫలితంగా సమ్మె కాల వేతనం, సంక్షేమ పథకాలపై హామీలు, ఇంజనీరింగ్ కార్మికులకు రూ.3,500 వేతన పెంపు వంటి ఫలితాలు సాధ్యమయ్యాయి.

అక్రమ తొలగింపులపై తిరుగుబాటు..

మార్కాపురం మున్సిపాలిటీలో జరిగిన అక్రమ తొలగింపులు కార్మిక ఉద్యమానికి మరో మైలురాయి. 25 ఏళ్లుగా మంచినీటి సరఫరా, వీధిలైట్ల మరమ్మతులు, పన్నుల వసూలు వంటి కీలక సేవలు అందిస్తున్న 21 మంది ఇంజనీరింగ్ కార్మికులను 2024 అక్టోబర్‌లో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎటువంటి నోటీసు లేకుండా అక్రమంగా తొలగించింది. తమ అనుయాయులకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా తీసుకున్న ఈ చర్య కార్మిక వర్గాన్ని రగిలించింది. దీంతో 13 రోజుల పాటు మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు, పికెటింగ్‌లు కొనసాగాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, రాజకీయ ఒత్తిళ్లు తెచ్చినా కార్మికులు మడమ తిప్పలేదు. పట్టణ ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

రౌండ్ టేబుల్ సమావేశాలు, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు, కమిషనర్ చాంబర్ ముట్టడి వంటి దశలవారీ పోరాటాలు ఉద్యమాన్ని ఉద్ధ తం చేశాయి. పోలీసుల అరెస్టులు జరిగినా కార్మికుల సంకల్పం చెక్కుచెదరలేదు. జిల్లాలోని ఒంగోలు, కనిగిరి, చీమకుర్తి, పొదిలి, గిద్దలూరు మున్సిపాలిటీల కార్మికులు సంఘీభావం తెలిపారు. చివరకు ప్రభుత్వం దిగివచ్చి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాల్సి వచ్చింది. ఇది సంఘటిత పోరాటానికి వచ్చిన స్పష్టమైన విజయం.

మరణించిన కార్మికుని కుటుంబానికి బాసట....

మేదరమెట్ల సిద్ధం సభ సందర్భంగా విధుల్లో ఉండి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడు యు. మురళీకృష్ణ మృతి ఘటనపై ఐదు డివిజన్లలో పని నిలిపివేసి రిమ్స్ వద్ద ఆందోళనలు చేపట్టారు. ఆ కుటుంబానికి నష్టపరిహారం, కుటుంబానికి ఉద్యోగం, పిల్లల చదువు అంశాలపై కలెక్టర్, మేయర్ హామీలు పొందడం ఉద్యమ ఒత్తిడి ఫలితమే..

ఉద్యమాల ఫలితంగా వేతన పెంపులు, బకాయిల చెల్లింపులు, అక్రమ తొలగింపుల ఉపసంహరణ, సంక్షేమ హామీలు సాధ్యమయ్యాయి. సిఐటియు జాతీయ మహాసభల వేళ ప్రకాశం జిల్లాలోని మున్సిపల్ కార్మికుల ఉద్యమం ఒక స్పష్టమైన పాఠం చెబుతోంది. ఐక్యత ఉన్నచోట హక్కులు సాధ్యమే. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఎదురు నిలవగల శక్తి సంఘటిత కార్మిక ఉద్యమానికే ఉందని ఈ పోరాటాలు నిరూపించాయి.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - మార్టూరు

ప్రజా సంక్షేమం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి సోమవారం వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల వింటూ తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం నినాదంతో ముందుకు సాగుతుందని అన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. గత ఐదేళ్లు అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలు అస్తవ్యస్తం అయాయని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా ప్రణాళికలతో అభివృద్ధి దిశగా సాగుతున్నట్లు తెలిపారు. అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులకు అవసరమైన సాగునీరు, ఎరువులు సకాలంలో అందిస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

జడ్పీ స్కూల్లో క్రీడా సామాగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - పర్చూరు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ శివ కోటేశ్వరరావు కోరారు. మండలంలోని ఉప్పుటూరు క్లస్టర్ పరిధిలోని పాఠశాలలకు సోమవారం క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు క్రీడా సామాగ్రి ఉపయోగించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ2 పి వెంకటరామయ్య, జెడ్పి పాఠశాలల క్లస్టర్ హెచ్ఎం జి వసుందరా దేవి, పీఈటీలు రమాదేవి, సరళదేవి, సిఆర్ఎం టి సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

దేవాలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తితో పాటు సేవా దృక్పథంతో కలిగి ఉండాలని అన్నారు. అనంతరం నిజాంపట్నం జల్సా బజార్‌లో రూ.8.5 లక్షలతో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన రేపల్లె నాయకులు మత్తి భాస్కర్, జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, టిడిపి నాయకులు తాత ఏడుకొండలు, కేసన్ రామకృష్ణ, టిడిపి నిజాంపట్నం గ్రామ అధ్యక్షులు ఖాదర్ బాబు, నిజాంపట్నం పిఎసిఎస్ చైర్మన్ మైల నరేష్ పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

రీ సర్వేపై లద్దేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి - బట్టిప్రోలు

మండలంలోని అద్దేపల్లిలో భూముల రి సర్వేపై తహశీల్దారు మేక శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే నిర్వహణ రైతులకు గొప్ప వరమని అన్నారు. 1923-1924 కాలంలో బ్రిటిష్ బ్రిటీషు ప్రభుత్వం నిర్వహించిన సర్వే ఫీల్డ్ మ్యాపుల ఆధారంగా ప్రస్తుత రెవెన్యూ రికార్డు ఉందని అన్నారు. అయితే ఆ రికార్డుల్లో రైతుల భూకమతాలు ఒకరి సర్వే నెంబరు మరొకరికి మార్పు కాబడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొంత మంది రైతుల భూములు పొరపాటుగా 22ఎ లిస్టులో నమోదై ఉన్నాయని తెలిపారు. దీనికి సమగ్ర రీ సర్వేలో ప్రక్షాళన జరుగుతుందని అన్నారు. రీ సర్వే విధి, విధానాలు, సమస్యలు వచ్చిన వెనువెంటనే అపిల్ చేసుకునే అధికారం రైతులకు కల్పించినట్లు తెలిపారు. ఈ అప్పిలేట్ అధికారి ద్వారా తక్షణమే ఆ గ్రామ పరిధిలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అనంతరం గ్రామ వీధుల్లో రెవెన్యూ అధికారులు రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు సర్పంచి ధారా రవి కిరణ్మయి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయి బాబా, ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, దీపాల ప్రసాదు, మాచర్ల నాగరాజు, విఆర్ఓ ఎన్ లక్ష్మి పాల్గొన్నారు.

బల్లికురవ : గ్రామీణ ప్రాంత ప్రజల భూ వివాదాల పరిష్కారానికి రి సర్వేతో ముగింపు పలికేందు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోతుందని డిప్యూటీ తహశీల్దారు ప్రహర్ష అన్నారు. మండలంలోని ఉప్పుమాగలూరులో సోమవారం జరిగిన రీ సర్వే ర్యాలీ అనంతరం గ్రామ సభలో ఆమె మాట్లాడారు. భూముల రి సర్వేకు రైతులు తమ వంతు సహకారం అందజేయాలని కోరారు. రీసర్వే జరిగే సమయంలో సంబంధిత భూముల రైతులు అందుబాటులో ఉండి సర్వే పారదర్శకంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. సుదీర్ఘ కాలంగా నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే దోహదం చేస్తుందని అన్నారు. రైతుల సహకారంతో సర్వే మరింత పారదర్శకం గా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర, టిడిపి నాయకులు దేవినేని వేణుబాబు, ఆర్ఐ పోతురాజు, విఆర్ఓ అశోక్ పాల్గొన్నారు.

అమృతలూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేలో భాగంగా 4వ విడత రీ సర్వేను మండలంలో నాలుగు గ్రామాలను ఎంపిక చేశారు. అందులో భాగంగా ఇంటూరు, ప్యాపర్రు గ్రామల్లోని రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. జనవరి 2 నుండి నూతనంగా రీ సర్వే మొదలు పెడుతున్నందున రైతులు, భూ యజమానులు రీసర్వే సమయంలో హాజరై భూములను సర్వే చేయించుకొని, వారి భూముల వివరాలు రికార్ధుల్లో నమోదు చేయించుకోవాలని తహశీల్దారు నెహ్రూ బాబు సూచించారు. గ్రామ సభలో డిప్యూటీ తహశీల్దారు కె రాజా రమేష్ మోహన్, మండల సర్వేయరు నాగేశ్వరరావు, ఇంటూరు, ప్యాపర్రు గ్రామ సర్వేయర్లు, విఆర్ఎ, భూ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలో 4వ విడత రీ సర్వే జనవరి 2 నుండి ప్రారంభించనున్నట్లు తహశీల్దారు బి వెంకటేశ్వర్లు తెలిపారు. కొల్లూరులో గ్రామ సభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. సభలో కొల్లూరు గ్రామ రైతులందరూ రీ సర్వేలో పాల్గొని సిబ్బందికి సర్వేకు సహకారం ఇవ్వాలని కోరారు. రైతులకు నోటీసుల ద్వారా తెలిపిన తేదీల్లో భూమిపై హాజరు, భూమి హద్దులు, దస్తావేజులు, ఆధార్ కార్డు, పాస్ పుస్తకం నకలు విఆర్ఓలకు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ఎన్ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమృతలూరు తహశీల్దారు నెహ్రూ బాబు

మాట్లాడుతున్న కొల్లూరు తహశీల్దారు బి వెంకటేశ్వర్లు

వెలుగు యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

పొదుపు సంఘం సభ్యులు 'మన డబ్బులు, మన లెక్కలు' యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సంస్థాగత నిర్మాణ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కాకి రవికుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పర్చూరు, కారంచేడు మండలాల గ్రామ సంఘ సహాయకులకు సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా సంఘాల సభ్యులకు ప్రతి సభ్యురాలు తన పొదుపు, అప్పు వివరాలు ఎప్పటికప్పుడు తమ మొబైల్ ద్వారా చూసుకునే సౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. సంఘాల్లో జరిగే చిన్న చిన్న తప్పిదాలు అరికట్టవచ్చని అన్నారు. సంఘం, సభ్యుల లెక్కలు పారదర్శకంగా ఉంటాయని అన్నారు. ప్రతినెల నిర్ణీత తేదీ ప్రకారం సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, సమావేశాలకు గ్రామ సంఘ సహాయకులు మొబైల్ ద్వారా హాజరై ఆ సమావేశంలో వారి లెక్కలన్నింటినీ మొబైల్ ద్వారా ఆన్లైన్ చేయడం జరుగుతుందని తెలిపారు. 10 సంఘాలకు ఒక ఈ నారి చొప్పున ఎంపిక చేసుకుంటారని తెలిపారు. వీరి ద్వారా ప్రతి సభ్యునికి లెక్కలపై అవగాహన కల్పించి వారి మొబైల్లో ఎలా చూసుకోవాలో నేర్పించడం, ప్రతినెల సంఘం పుస్తకాలు గ్రూపు సభ్యుల్లో చదువుకున్న వారి ద్వారా వారే రాసుకునే విధంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ యాప్ నందు ఈ లెర్నింగ్ అనే అంశం కూడా ఉన్నదని అన్నారు. బ్యాంక్ లింకేజ్ డిపిఎం అనంత్ లక్ష్మీనాచారి మాట్లాడుతూ తీసుకునే అప్పు మొత్తాన్ని జీవనోపాదులకే వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ కె విజయభాస్కర్, ఓ శ్రీనివాసరావు, పర్చూరు, కారంచేడు ఎపిఎంలు టి మోహనరావు, కె రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెలుగు పిడి కె రవికుమార్

మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

సీఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - చీరాల

అనారోగ్య సమస్యతో బాధపడుతున్న పేదల ఆరోగ్యానికి సిఎం సహాయ నిధి బరోసాగా నిలుస్తుందని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. తన కార్యాలయంలో సోమవారం మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గొల్లపాలెంకు చెందిన తన్నీరు శేషమ్మకు రూ.2లక్షలు, కొత్తపాలెంకు చెందిన వావిలపల్లి సురేష్ వైద్యం కోసం రూ.6లక్షలకు ఎల్ఓసి అందజేశారు.



రాజశేఖరబాబును సత్కరిస్తున్న శ్రీనివాసరావు

రాజశేఖరబాబుకు అభినందన

ప్రజాశక్తి- సంతమాగులూరు

తెలుగుదేశం బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులుగా ఎన్నికైన సలగల రాజశేఖర్ బాబును మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన టిడిపి బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఆలూరి శ్రీనివాసరావు బాపట్లలో మర్యాద పూర్వకంగా సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

సమాజ సేవ తత్పరుడు కత్తి కొండయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమలు కత్తి సుబ్బారావు, రాఘవరావు, మోషే సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులు, పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్డు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ అలహరి హరిప్రసాద్, పూర్వ అధ్యక్షులు వీరయ్య, షేక్ మహమ్మద్ రఫీ, గూడ లక్ష్మీరెడ్డి, అంజాద్ భాష, ఆసుపత్రి వైద్యాధికార్లు డాక్టర్ జ్యోతి, డాక్టర్ తేజస్వి పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న రేపల్లె ఆర్‌డిఒ ఎన్ రామలక్ష్మి

వినతులు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - రేపల్లె

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులు విచారించి పరిష్కరించాలని ఆర్‌డిఒ ఎన్ రామలక్ష్మి సిబ్బందికి సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4అర్జీలు కొత్తగా వచ్చాయని తెలిపారు. సంబంధిత అధికారులు పరిష్కరించేందుకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు అధికారులు తక్షణమే స్పందించి త్వరిత గతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇంకొల్లు : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తహశీల్దారు కార్యాలయంలో 4అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు ఎంఎస్‌వి శ్రీనివాసరావు తెలిపారు. భూ సర్వే కొరకు మూడు, భూ వివాదంపై ఒకటి వినతి పత్రాలు వచ్చినట్లు తెలిపారు.

కార్మికుడిపై దాడి పట్టదా.?

- అధికారం చెలాయించడంలో హద్దుల్లేవు
- కార్మికుల సమస్యల విషయంలో పలాయనం
- కార్మికుడిపై దాడి జరిగినా స్పందించని అధికారి
- నిందితులను అరెస్టు చేయడంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థలోని ఉన్నతాధికారులు ఉద్యోగులు, కార్మికులపై పెత్తనం చెలాయించడానికి చూపే ఉత్సాహం వారి ఇబ్బందులు పట్టించుకోవడంలో ఉండదని మరోసారి నిరూపించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత నగరపాలక సంస్థలో పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల పరిస్థితి బంతిలా మారింది. పని ప్రదేశాలు మార్చడం, పని విధానాన్ని మార్చడం ఇష్టానుసారం చేస్తురు. పెత్తనం చెలాయించే విషయంలో మేస్త్రి దగ్గర నుండి కమీషనర్ వరకు ఎవరూ తగ్గదేలే అన్నట్లు వ్యవహరిస్తురు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఈ విషయంలో హద్దులు దాటి ప్రవర్తించారనే ఆరోపణలున్నాయి.

కార్మికుని కోసం అధికారాలు పనిచేయవా

ఈ నెల 26న కొర్నెపాటి యాకోబు అనే కార్మికుడు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని దారావారితోట ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆటోలో ఉల్లిపాయలు వ్యాపారం చేసుకునే వ్యక్తి అప్పుడే శుభ్రం చేసిన రోడ్డుపై ఉల్లిపాయల పొట్టు పోస్తుండగా యాకోబు వారించి, ఉల్లిపాయల పొట్టు రోడ్డుపైన వెయ్యవద్దని, తన ఆటోలో

సిసి కెమెరాలో రికార్డయిన కార్మికుడిపై దాడి దృశ్యాలు

వెయ్యమని చెప్పాడు. ఆయన మాటలు లెక్క చేయకుండా రోడ్డుపైనే పోశారు. దీంతో ఇద్దరికీ వాదన జరిగింది. సహనం కోల్పోయిన ఉల్లిపాయల వ్యాపారి యాకోబుపై దాడిచేసి కొట్టాడు. అతనితో పాటు ఆయన కొడుకు కూడా తోడై ఇష్టారీతిన రక్తం వచ్చేలా కొట్టారు. చుట్టుపక్కల వారు వచ్చి ఆపే వరకు కొడుతూనే వున్నారు. అక్కడున్న వారి సహకారంతో యాకోబు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నాడు. జిజిహెచ్ అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసుకుని అనంతరం ఒంగోలు 1వ పట్టణ పోలీసు స్టేషనుకు బదిలీ చేశారు.

4రోజులైనా స్పందించని అధికారులు

కార్మికులు టిఫిన్ చేయడానికి, మంచినీరు తాగడానికి, కాల కృత్యాలు తీర్చుకునేందుకు పక్కకు వెళ్ళినా పనిలో నిలిపివేసి ఇబ్బందులు పెట్టి తమ అధికార దర్పం ప్రదర్శించే మున్సిపల్ అధికారులు కార్మికుడిపై దాడి జరిగి 4రోజులైనా స్పందించలేదు. కనీసం కార్మికుడిని పరామర్శించ లేదు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ తన విభాగంలో కార్మికుడిపై జరిగిన దాడి విషయంలో ఇంతవరకు స్పందించక పోవడం పట్ల కార్మకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి కార్మికుడికి అండగా నిలవాలని, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేసు నమోదు చేయడంలోనే పోలీసుల నిర్లక్ష్యం

కార్మికుడు యాకోబుపై జరిగిన దాడి ఘటనలో 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేయడంలోనూ నిర్లక్ష్యం చేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 27న 115(2), 118(1), 351(2) రెడ్ విత్ 3(5) బిఎన్ఎస్ సెక్షన్ల క్రింద ఎఫ్ఐఆర్ 213/2025 నంబర్‌తో కేసు నమోదు చేశారు. కానీ నిందితులను అరెస్టు చేయలేదు. ఉద్యోగులు, కార్మికుల విధులకు ఆటంకం కలిగించడం, వారిపై భౌతిక దాడికి పాల్పడడం చేస్తే వారిపై 353 సెక్షన్ కింద కేసు నమోదు చేయాల్సి ఉండగా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయలేదు.

నేడు ఆందోళన చేపట్టనున్న కార్మికులు

తమ తోటి కార్మికుడిపై జరిగిన దాడి పట్ల మున్సిపల్, పోలీసు అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మంగళవారం ఆందోళన చేపట్టనున్నట్లు సిఐటియు అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు.

టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శిగా కుమారస్వామి

ప్రజాశక్తి - భటప్రోలు

బాపట్ల టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శిగా భట్టిప్రోలుకు చెందిన కటకం కుమారస్వామి నియమితులయ్యారు. ఆయన నియామకానికి కృషి చేసిన శాసన సభ్యులు నక్కా ఆనంద బాబును ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ అభివృధి, సంక్షేమ కార్యక్రమాల అమలు గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించి పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని అన్నారు. తనతో పాటు బిసి సెల్ అధ్యక్షులు బట్టు

ఆనందబాబును సత్కరిస్తున్న భట్టిప్రోలు టిడిపి నాయకులు

మల్లిఖార్జునరావు, మండల ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కల లెనిన్, గ్రామ అధ్యక్షులు కుక్కల వెంకటేశ్వరరావు, డిసి అధ్యక్షులు యర్రంశెట్టి కర్ణ శ్రీనివాసరావు, జడ్పిటిసి తిరువీధుల ఉదయభాస్కరి, బాలాజీ, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, నీటి సంఘం డైరెక్టర్ పోలన వెంకటరమణ, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జంగం శ్యాంసన్, ఇబ్రహీం బేగ్ (బుజ్జి), మండల కార్యదర్శి యర్రంశెట్టి పార్ధసారధి, మైనార్టీ సెల్ అధ్యక్షులు హబుల్లా ఖాన్ (తాలు), నల్లమిల్లి వెంకట సుబ్బారావు, కౌసర్ అలీబేగ్, జక్కా బాలాజీ, వంగర వీరయ్య, జొన్నధుల ప్రసాద్, కౌతరపు శ్రీనివాసరావు, తాడిపర్తి సత్యనారాయణ, దామర్ల నాగరాజు, బట్టు రామకృష్ణ, ఆకురాతి వెంకటేశ్వరావు (బొంబాయి), సంగపు లాల, ఉక్కడాల ఆనంద్ ఉన్నారు.

మాట్లాడుతున్న గాదె మధుసూదనరెడ్డి

అందుబాటులో ఉంటా : గాదె

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని శ్యామలావారిపాలెం, పోలూరు, పెద జాగార్లమూడి, తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం, గన్నవరం, పూనూరు గ్రామాల్లో వైసిపి ఇంచార్జి గాదే మధుసూధనరెడ్డి సోమవారం పర్యటించారు. వైసిపి మండల కన్వీనర్ రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో గ్రామ కమిటీల సమావేశాలు నిర్వహించారు. శ్యామలవారిపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుసూదనరెడ్డి మాట్లాడుతూ తాను ఎప్పుడూ నిజమైన కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అర్ధ రాత్రి అయిన స్తానని అన్నారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు గంగిరెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు అనిల్, ఈమని శేషిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు గుడిబండ్ల లక్ష్మీ, యువజన విభాగం అధ్యక్షులు కోటిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు గంట శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షులు బుద్ధిగం వాసిరెడ్డి, తన్నీరు అంకమ్మరావు, షేక్ బుడే, యన్నం శ్రీను, పోలూరు గ్రామ అధ్యక్షులు దొడ్డా రవి కుమార్, జి రామ కృష్ణ, ఎంపిటిసి ఖాసీం వలి, రావిపాటి వీరయ్య, అనంతవరం 5వ వార్డు సభ్యులు సుభాష్, కె అఖిల్, వలేరు భాస్కర్, లాజర్, రవి, యనమదల గ్రామానికి చెందిన తిరునవల్లి హనుమం తరావు, మండవ శ్రీను, నాగేంద్ర, రంగయ్య, రాంబాబు పాల్గొన్నారు.

యోగా ఛాంపియన్ పశ్చిమబెంగాల్ యువతి

ప్రజాశక్తి - బాపట్ల

మానవాళి శాంతియుత జీవన విధానానికి యోగ దోహద పడుతుందని శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ అన్నారు. మండలంలోని జిల్లెళ్ళమూడిలో జరుగుతున్న జాతీయ స్థాయి యోగాసన ఛాంపియన్షిప్ ముగింపు సందర్భంగా సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అద్భుతమైన యోగాసన విద్య అజరామరంగా నిలిచి ఉంటుందని అన్నారు. భారతీయతలో యోగా అంతర్భాగమని అన్నారు. ఇక్కడ జరిగిన యోగాసన పోటీల్లో జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వాళ్లు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో జరిగిన యోగా పోటీల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువతి అనీషా భౌమిక్‌కు ఛాంపియన్ షిప్ ట్రోఫీ నిర్వాహకులతో కలిసి అందజేశారు. పోటీలకు ఆతిథ్యం ఇచ్చి ఆదరించిన జిల్లెళ్ళమూడి శ్రీ విశ్వజనని పరిషత్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఇండియన్ యోగ

విజేతకు చాంపియన్ ట్రోఫీ ఇస్తున్న ఎమ్మెల్యే

ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిడ్జ్ భూషణ్ పురోహిత్, ప్రధాన కార్యదర్శి మృణాల చక్రవర్తి, రాష్ట్ర యోగ అసోసియేషన్ అధ్యక్షులు కూన కృష్ణదేవరాయులు, చైర్మన్ కళ్ళం హరినాధరెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్, వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం, అసోసియేషన్ కో ఆర్డినేటర్ శ్రీమన్నారాయణ, శీలం శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మీనారాయణరెడ్డి, నాగరాజు, వీరభద్రయ్య, ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సత్రం ఆస్తులు కాపాడాలని వినతి

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొందుకు చెందిన కర్రీ అనంతమ్మ తనకు పిల్లలు లేకపోవుటం వలన తనకున్న ఆస్తిలో కొంత ఇంకొల్లు పాలెం రోడ్డులో పుర మందిర సత్రం ఏర్పాటు చేసింది. ఆ పుర మందిరం అభివృద్ధికి తనకున్న ఆస్తిలో 2.70ఎకరాల పొలం కేటాయించింది. ఆ

పురమందిరం ఆస్తిపై అర్జీ ఇస్తున్న దృశ్యం

పొలంపై వచ్చే ఆదాయంతో అభివృద్ధి చేయాలని వీలునామా రాసింది. అయితే గత కొన్ని రోజులుగా ఈ ఆస్థిపై వివాదం చోటు చేసుకుంది. కర్రీ వారి వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో సత్రం స్థలం, ఆ పొలంకు కంచ ఏర్పాటు చేశారు. ఈ వివాదంపై గ్రామస్తులు కొందరు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు.

సరస్వతమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

సరస్వతమ్మ కృషి చిరస్మరణీయం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల ప్రాంతంలో స్త్రీ విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేసిన వెలగపూడి సరస్వతమ్మ చిరస్మరణీయులని ఫారం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. సరస్వతమ్మ 133వ జయంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో ఎస్ఎంజి జూనియర్ కళాశాల వద్ద ఆమె విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1915లో ఆమె చేత ప్రారంభించిన 'యువతి విద్యా నిలయం' నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా అభివృద్ధి చెందిందని అన్నారు. విద్యాభివృద్ధికి సరస్వతమ్మ తమ జీవిత సర్వస్వం అర్పించారని అన్నారు. పట్టణం నడిబొడ్డున అరెకరం స్థలాన్ని విద్యా సంస్థకు విరాళంగా ఇచ్చారని అన్నారు. ఆమె స్థాపించిన విద్యాసంస్థల్లో చదివిన మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళల అభివృద్ధికై పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దుర్గాప్రసాదరావు, హై స్కూల్ హెచ్ఎం శివపార్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామిని దర్శించుకున్న మధుసూదనరెడ్డి

ప్రజాశక్తి. ఇంకొల్లు

మండలంలోని పావులూరు పొలిమేరలోవేంచేసి ఉన్న శ్రీ పొలిమేర వీరాంజనేయ స్వామి ఆలయాన్ని వైసిపి రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చక స్వామి రమేష్ బాబు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మాట్లాడుతున్న డిప్యూటి ఎంపిడిఓ సుమతి

స్వామిత్వ సర్వేతో ఆస్తులపై హక్కు

ప్రజాశక్తి - బల్లికురవ

గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వామిత్వ సర్వే ద్వారా తమకున్న అన్ని ఆస్తులపై హక్కు సమ కూరుతుందని డిప్యూటీ ఎంపిడిఓ సుమతి అన్నారు. మండలంలోని వైదనలో సోమవారం జరిగిన స్వామిత్వ సర్వే అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నివాస స్థలాలు మ్యాపింగ్ చేసి డ్రోన్ టెక్నాలజీ ప్రయోగించి ఆర్థిక పత్రాలు జారీ చేసే ప్రభుత్వ పథకం అన్నారు. ఈ సర్వే ద్వారా యాజమాన్యం స్పష్టత పెంచటం, ఆర్థిక సాధికారత, ఆస్తి హక్కు పత్రాలు ఉపయోగించి బ్యాంకు రుణాలు మంజూరు చేయటం, ఇతర ప్రయోజనాలకు స్వామిత్వ సర్వే ద్వారా జారీ చేయబడ్డ పత్రాలు ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు. సిబ్బంది పారదర్శకత, జవాబుదారీతనంతో సర్వే చేయాలని చెప్పారు. సర్వే పూర్తయితే ఆస్తి సంబంధిత వివాదాలకు పూర్తి స్థాయిలో స్థిరపడుతుందని అన్నారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరంకు చెందిన వీరంకి సాంబశివరావు (69) ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం తన ఇంటి ముందు గల జాతీయ రహదారి 216పై నిలబడి ఉండగా భట్టిప్రోలు వైపు నుండి కనగల వైపుకు వస్తున్న ఎపి 39జి 3416 నెంబర్ గల మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కొడుకు వీరంకి ఏడుకొండలు పిర్యాదు మేరకు ఎస్ఐ ఎం శివయ్య ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

• ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి ఆఫీసు క్యాలెండర్-2026, ప్రజాశక్తి డైరీలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సోమవారం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఐ అండ్ పిఆర్ ఏడి వెంకట్రమణ, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

శిక్షణ సరే..కుట్టుమిషన్లు ఏవీ.?

- మిషన్ల కోసం మహిళల ఎదురుచూపులు
- కలెక్టరేట్ వద్ద నిరసన

నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక మహిళలకు ఆర్థిక చేయూత కోసమంటూ బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కోసం మండలాల వారీగా వందల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో అర్హులను ఎంపిక చేసి శిబిరాలు పెట్టి.. శిక్షణ ఇచ్చేవారిని ఎంపిక చేసి కుట్టు శిక్షణ ఇవ్వడం జరిగింది. ముందుగా చెప్పిన మేరకు మహిళలకు కుట్టుశిక్షణ పూర్తి అయ్యాక వారికి కుట్టుమిషన్లు పంపిణీ చేయ్యాల్సి ఉంది. కానీ కుట్టు శిక్షణ పూర్తి అయి నెలలు గడుస్తున్నా ఈ విషయం గురించి అధికారులకు ఎలాంటి స్పష్టత లేకపోయింది. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమకు ఇస్తామన్న ఉచిత కుట్టుమిషన్లు అందిస్తే వాటి ద్వారా ఉపాధి పొంది తమ కాళ్లపై తాము నిలబడతామని ఎదురుచూస్తూ వచ్చారు. కానీ ప్రభుత్వం నుంచి గానీ, అధికారుల నుంచి గానీ ఎలాంటి స్పష్టత లేకపోయింది. ప్రభుత్వం ఇస్తామన్న కుట్టుమిషన్లు ఇవ్వకుండా జాప్యం చేయడం ఏంటని మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద తమ నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్ కుమార్‌కి అర్జీ అందజేశారు.

కుట్టుమిషన్లు వెంటనే ఇవ్వాలి..

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషన్లు ఇచ్చి వారి ఆర్థిక పరిస్థితికి మెరుగయ్యే విధంగా ప్రోత్సహించాలని, లేని పక్షాన మహిళను ఐక్యం చేసి ఉద్యమించాల్సి వస్తుందని సిఐటియు బాపట్ల పట్టణ నాయకులు కె శరత్, భవాని, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, రమ్య, తిరుపతమ్మ తెలిపారు.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ బి.ఉమామహేశ్వర్

మాట్లాడుతున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గంజాయి నిర్మూలన, సైబర్ నేరాల నియంత్రణపై బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం మరింత దృష్టి సారించిందని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. సోమవారం బాపట్ల జిల్లా వార్షిక నేర నివేదికపై స్థానిక జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు. 2025 సంవత్సరానికి సంబంధించిన నేరాలు, వాటి పురోగతిని మీడియా ప్రతినిధులకు వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు రక్షణ కల్పించడం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, మహిళల రక్షణలో ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. దీనికి ప్రధాన కారణం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడమేనని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, చీరాల డీఎస్పీ ఎండి.మోయిన్ పాల్గొన్నారు.

డిఆర్‌డిఏ పీడీగా సింగయ్య

కలెక్టర్‌ను కలిసిన సింగయ్య

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా డిఆర్‌డిఏ పీడి గా బత్తుల సింగయ్య నియమించబడ్డారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలు మండలాల్లో ఎండివోగా పని చేసిన సింగయ్య ప్రస్తుతం జిల్లాలో డ్వామా ఎపిడిగా పనిచేస్తున్నారు. సోమవారం డిఆర్‌డిఏ పీడి గా భాధ్యతలు చేపట్టిన సింగయ్య జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు.

అర్జీలు సత్వరం పరిష్కరించండి: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసుతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమం ద్వారా

'ఉపాధి' చట్టాన్ని కాపాడుకుందాం..

- రాష్ట్రాల హక్కుల్ని లాక్కునేందుకే కేంద్ర ప్రభుత్వ యత్నం..
- సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజాఉద్యమం ద్వారా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందామని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్ ఆమోదం పొందిన బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం నాడు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన ఈ సదస్సులో రాజ్యాంగ విరుద్ధంగా అప్రజాస్వామిక పద్ధతిలో పార్లమెంట్‌లో ఏక పక్షంగా గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విబిజి రామ్‌జిగా మారుస్తా ఆమోదించిన తీరు పట్ల సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసి, కాంగ్రెస్, సమాజ్ వాది, ఆమ్ ఆద్మీ, ఐఎల్పి, లిబరేషన్ కాంగ్రెస్ వంటి పార్టీలకు చెందిన నేతలు కిసాన్ సంయుక్త మోర్చా, సిఐటియు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం వంటి ప్రజాసంఘాలకు చెందిన నేతలు తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ మనువాద రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న మోడీ చర్యలను తప్పు పట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఏకపక్షంగా మార్చిందని, ఈ మార్పులు గ్రామీణ ప్రజల జీవితాలను మరింత దుర్భరంగా మారుస్తాయని తీవ్రంగా విమర్శించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించడానికి గ్రామీణ స్థాయిలో ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు.

పార్లమెంట్ లో ఎటువంటి చర్చలను అనుమతించకుండానే బిల్లును ఆమోదించి చట్టాన్ని స్కీమ్‌గా మార్చడం ప్రజాస్వామ్య విరుద్ధమని తీవ్రంగా మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో నిధుల కోతలు విధిస్తూ, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా 40 శాతం నిధులు డిపాజిట్ చేయాలన్న నిబంధన తెచ్చిందని విమర్శించారు. ఇది రాష్ట్రాలపై భారాన్ని మోపి పథకాన్ని అమలు కాకుండా చేసే కుట్రేనన్నారు. దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దోహదపడిన చట్టాన్ని మోడీ ప్రభుత్వం చేపట్టిన మనువాద చర్యలకు వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ ద్వారాగ్రామ స్థాయిలో ప్రజా పోరాటం చేపట్టాలని తీర్మానం ప్రవేశపెట్టారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్. నారాయణ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి బడ్జెట్‌లో నిధుల కోతలు విధిస్తూ ఉపాధి చట్టాన్ని నీరుగార్చుతోందన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుసిద్ధాంతం అమలు చేస్తున్న చర్యలకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రజలను కదలించడానికి ఐక్య కార్యాచరణ రూపొందించాలన్నారు.

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సైతం ప్రశంసించిన చట్టాన్ని మోడీ 2016 నుంచి నిర్వీర్యం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. కొలతలు, ఎఫ్ ఆర్ ఎస్, నిధులు కోత,యంత్రాల ప్రవేశం వంటి చర్యలతో చట్టాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు.

సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎంఎస్ సాయి మాట్లాడుతూ ప్రజలమధ్య వైరుధ్యాలు సృష్టించి ఉపాధి హామీ చట్టాన్ని కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తున్నట్లు ధ్వజమెత్తారు.

సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ తమకు తాము దేశభక్తులుగా చాటి చెప్పుకునే కుహనా రాజకీయ నేతలు పేదప్రజలకు పోషకాహారం అందించినపుడే నిజమైన దేశభక్తులని స్పష్టం చేశారు. పేదలకు ఉపాధి, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో పాటు, వ్యవసాయ అభివృద్ధికి దోహద పడినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరిగినేని వెంకట శేషయ్య మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ చర్యలకు నిరసనగా గ్రామీణ పేదలను కదిలించాలని సూచించారు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు వి సుదర్శన్ మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్యం పట్ల మోడీకి విశ్వాసం లేదన్నారు. ఐఎల్ పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం రద్దు చేసే కుట్ర లో కూటమి ప్రభుత్వం కూడా భాగస్వామ్యం ఉందన్నారు. లిబరేషన్ కాంగ్రెస్ నాయకులు చిటితోటి శోభన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరు జయంతి బాబు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడారు. ఉపాధి చట్టాన్ని కాపాడుకునేందుకు గ్రామీణ స్థాయిలో పోరాటం చేపట్టాలని, దీనికి వామపక్ష, లౌకిక ప్రజా తంత్ర శక్తులు ఐక్య కార్యాచరణ రూపొందించాలని ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బి రఘురామ్, వి బాలకోటయ్య, బంకా సుబ్బారావు, సీనియర్ నాయకులు వై సిద్ధయ్య, పెంట్యాల హనుమంతరావు, కనపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'ఫాసిస్ట్ తరహా' విధానాలకు వ్యతిరేకంగా

ప్రజలు తిరుగుబాటు చేయాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు

మాట్లాడుతున్న పూనాటి ఆంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజాసంక్షేమాన్ని విస్మరించి ఫాసిస్ట్ తరహా చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేయవలసిన సమయం ఆసన్నమయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం సిఐటియు అఖిల భారత 18వ మహాసభల సందర్భంగా యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మోడీ అధికారం చేపట్టిన అనంతరం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు తీవ్రతరం చేస్తున్నట్లు వివరించారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించి కార్మిక చట్టాలు, అణువిద్యుత్ బిల్లు, భీమా రంగంలో 100శాతం పెట్టుబడులు, గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి నాలుగు బిల్లులు ఆమోదింప చేసినట్లు వివరించారు. ఈ నాలుగు బిల్లులు ప్రజల సంపదను, హక్కులను, ఆరోగ్య భద్రతకు ముప్పు వాటిల్లేవిగా ఆయన పేర్కొన్నారు.

కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు స్థానే మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు అమలు పేరున 40 కోట్ల మంది కార్మికుల నుదుటిపై మరణ శాసనం లిఖించారని ధ్వజమెత్తారు. 28 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నోటిపై చేసిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను పూర్తిగా హరించేలా రూపొందించడంవల్ల కార్మికవర్గం కార్పొరేట్లకు బానిసలుగా మార్చే చర్యగా ధ్వజమెత్తారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ అమలు వల్ల 300 మంది వరకు ఉద్యోగులు ఉన్న సంస్థలు కార్మికులను ప్రభుత్వ అనుమతి లేకుండానే తొలగించే స్వేచ్ఛ పొందుతాయని, ఈ కారణంగా కంపెనీల్లో పని చేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కొరవడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యల కారణంగా వేలాదిమంది ఉద్యోగులు ప్రమాదంలో పడతారని పేర్కొన్నారు. దీంతో పాటు సమ్మె హక్కులను అడ్డుకునే విధంగా 14 రోజుల నోటీసు వ్యవధిని 60 రోజులకు పెంచడం, యూనియన్ గుర్తింపు కోసం 51 శాతం సభ్యత్వం షరతు విధించడం కార్మిక ఉద్యమాలను బలహీనపరచే యత్నమని ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పిస్తూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దోహద పడిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ చట్టం మార్పు చేస్తూ బిల్లు ఆమోదించడం ప్రజా వ్యతిరేకచర్యగా పేర్కొన్నారు. కాగా రూపాయి విలువ గణనీయంగా పడిపోతున్నా కేంద్రం ఏ మాత్రం జోక్యం చేసుకోకపోవడం వల్ల కొనుగోలు శక్తి పడిపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న చర్యలను ప్రజలు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. సిఐటీయు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సిఐటీయు జిల్లా నాయకులు బివి రావు, జి రమేష్, యుటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.